
అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 34 | గురువారం 5 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-




## కాంగ్రెస్‌కు ఒక లక్ష్యం, ప్రణాళిక లేదు

- రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం
- దేశం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ పనిచేయలేదు
- 'ఎన్డీయే హయాంలో భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా మారనుంది
- దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది
- దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు
- గతంలో భారత్‌తో ఒప్పందానికి పలు దేశాలు ముందుకు వచ్చేవి కాదు
- దేశం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ పనిచేయలేదు

### నదుల అనుసంధానం జరగాలి

# ప్రతీ ఎకరాకు నీరందాలి




- సంఘాల ప్రతినిధులే ఇంజనీర్లుగా మారి నీటి నిర్వహణను చేపట్టాలి
- 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- నీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో సీఎం చంద్రబాబు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**


నదుల అనుసంధానం జరగాలి, ప్రతీ ఎకరాకు నీరందించటమే భూమాతకు ఇచ్చే మనమిచ్చే జలహారతి అని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలో గురువారం నిర్వహించిన నీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గతంలో నీటి పరిరక్షణ కోసం వాటర్ షెడ్ డెవలప్మెంట్ చేశాం. అడవుల చుట్టూ కాంటూర్ ట్రెంచ్ లు తవ్వి, ప్రతీ చోటా భూగర్భజలాలు పెంచే ప్రయత్నం చేశాం. 201924లో తిరుమలలో లడ్డూ ప్రసాదాన్ని గత పాలకులు కల్తీ చేశారు. రసాయనాలు కలిపి దాన్ని నెయ్యిగా సరఫరా చేశారు. మహాపాపం చేసి భగవంతుడి పట్ల ఘోర అపచారం చేశారు. రూ.20 లక్షల కోట్ల మేర పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఆ పరిశ్రమలన్నింటికీ నీళ్లు ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయానికి 900 టీఎంసీలు, పరిశ్రమలకు 40 టీఎంసీలు, తాగు నీటి కోసం 200 టీఎంసీల నీరు అవసరం. ప్రతీ ఏటా 1300 టీఎంసీల నీటితో మన రాష్ట్ర అవసరాలు తీరతాయి. 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయి. వీటన్నిటిలో 1300 టీఎంసీలకుపైగా నీటిని నిల్వ చేసుకోగలం. ఈ ఏడాది 862 టీఎంసీల నీళ్లు మన జలాశయాల్లో జల కళతో - మిగతా3లో



## బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు

- అసెంబ్లీలో మమతా బెనర్జీ కీలక ప్రకటన
- సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటన
- బీఎస్ఎఫ్ అధికార పరిధి నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

## కుట్రతోనే ప్రధాని సీటును కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు



- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- భద్రత దృష్ట్యా సభకు రావద్దని ప్రధానికి సలహా ఇచ్చా
- ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు ప్రధాని సీటు ముందు నిల్చొని నిరసన తెలిపారు
- 'కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి ఊహించని సంఘటనకు పాల్పడవచ్చని నాకు విశ్వసనీయ సమాచారం అందింది

## 'ఏఐ4 ఏపీ పోలీస్'తో నూతన ప్రాజెక్ట్




- ఇకపై త్వరగా కేసుల పరిష్కారం.. ఆరు నెలల్లో అన్ని జిల్లాల్లో అమలు
- మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి 8 మాడ్యుల్స్ అమలు ప్రారంభించిన డీజీపీ
- నేర పరిశోధన, కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్న హరీష్ కుమార్ గుప్తా
- 'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్ట్‌లో ఎనిమిది మాడ్యూల్స్ కీలకం కానున్నాయి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను జోడిస్తున్నారు. "ఏఐ4 ఏపీ పోలీస్" పేరుతో నూతన ప్రాజెక్ట్‌ను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. మూడు జిల్లాల్లో ఈ పైలెట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. నేర పరిశోధన, కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుందని డీజీపీ అన్నారు. - మిగతా3లో



## బొగ్గు గనిలో పేలుడు.. 10 మంది మృత్యువాత

- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 10 మంది కార్మికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

## కల్తీ నెయ్యి దోషుల్ని వదిలిపెట్టం

- తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదు
- భగవంతుడి మీద పగ పట్టిన వారు మట్టికొట్టుకుపోతారు
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

కల్తీ నెయ్యి కేసులో దోషుల్ని వదిలిపెట్టం అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయంలో బిజెపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశం అయ్యారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఏడుకొండలవాడికి రెండు కొండలు చాలు అన్న ఆలోచనా విధానం నుంచి, శ్రీ వెంకటేశ్వరస్వామికి ఉన్నది రెండే కొండలు అన్న వారసత్వం నుంచి - మిగతా3లో



## అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

- పీయూష్ గోయల్
- రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన
- ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని వెల్లడి
- మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందన్న పీయూష్ గోయల్

## జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయండి

- అధికారులను ఆదేశించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సెర్ప్‌ఎఫ్.పి.ఓల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక 'టూల్' అభివృద్ధిపై చర్చ
- విజయవంతమైన ఎఫ్.పి.ఓల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలి
- సూచించారు. ఎన్.జి.ఓల పురోగతిని సమీక్షించడానికి ఒకే రకమైన ఫార్మాట్‌ను రూపొందించాలి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

గ్రామీణ జీవనోపాధుల అభివద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రధాన కార్యాలయంలో ఎఫ్.పి.ఓలకు సాంకేతిక సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల (ఎన్ జి వోల) ప్రతినిధులు, సెర్ప్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం - మిగతా3లో



# రాజ్యసభకు చిరంజీవి?

**విజయవాడ :** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి 20 నెలల పాలన పూర్తి చేసుకుంది. ప్రజల్లో ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే టిడిపి శ్రేణులు గట్టిగానే ఢీకొడుతున్నాయి. వారితో పోల్చుకుంటే జనసేన నేతలు స్పందించడం లేదు. దీనిపైనే చర్చ నడుస్తుండగా పార్టీ శ్రేణులకు గట్టి సంకేతాలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య కీలక రాజకీయ చర్చలు జరిగాయి. లడ్డూ వివాదం నేపథ్యంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో అనుసరించాల్సిన అంశాలపై వారిద్దరి మధ్య చర్చ సాగింది. సహజంగానే ఇద్దరు నేతల ఏకాంత భేటీ అంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి అయి ఉంటుంది. మరోవైపు ఇటీవల పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. దీంతో ఇద్దరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమల లడ్డూ తయారీకి సంబంధించి వాడిన నెయ్యిలో వైసిపి హయాంలో జంతు కొవ్వు కలిసిందన్నది ప్రధాన ఆరోపణ. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గత కొద్ది నెలలుగా విచారణ చేపట్టింది. ఇటీవల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మరోవైపు సిబిఐ ల్యాబ్ నిర్ధారణ అంటూ ఒక విషయం బయటపడింది. ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలపలేదన్నది ఒక వాదన. వాడినది మాత్రం ఆవు పాలతో తయారు చేసిన నెయ్యి కాదని.. కొన్ని రసాయనాల మిశ్రమాలతో తయారు చేసింది అంటూ మరో వాదన. ఈ విషయంలో అధికార విపక్షాల మధ్య గట్టి ఫైట్ నడుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిసాయి. దానికి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాప ప్రక్షాళన యాత్ర చేపట్టింది.



అందులో భాగంగా మాజీమంత్రి అంబటి రాంబాబును టిడిపి శ్రేణులు అడ్డగించాయి. ఈ క్రమంలో ఆయన సీఎం చంద్రబాబుపై బూతు వ్యాఖ్యలు చేశారు. ఆయన అరెస్టు జరిగింది. ఈరోజు అంబటి కుటుంబ సభ్యులను జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. అయితే ఈ ఎపిసోడ్ నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చారు పవన్ కళ్యాణ్. కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. అయితే హోం శాఖ మంత్రి అమిత్ షాను కలవడం మాత్రం కొత్త చర్చకు దారితీసింది. రాజ్యసభ పదవి కోసమే పవన్ ఢిల్లీ వెళ్లారని ప్రచారం జరిగింది. ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని.. టిడిపికి చెందిన సానా సతీష్ పదవీ విరమణ చేయనున్నారు. గతంలో నాలుగు రాజ్యసభ పదవులకు గాను.. బిజెపి, టిడిపి రెండు పదవులు చొప్పున తీసుకున్నాయి. జనసేనకు రాజ్యసభలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేదు. అందుకే ఈసారి తమకు చాన్స్ ఇవ్వాలని కోరేందుకు పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లినట్లు ఒక ప్రచారం అయితే మాత్రం జరిగింది. అయితే ఈరోజు సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ రాజ్యసభ పదవుల కోసమేనన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేనకు ఒక రాజ్యసభ పదవి ఖాయమని తెలుస్తోంది. ప్రధానంగా లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ చిరంజీవి పేరు తెరపైకి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవిని రాజ్యసభకు పంపితే జరిగే లాభనష్టాలు గురించి వారిద్దరూ చర్చించుకున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. గతంలో కూడా చిరంజీవి విషయంలో రకరకాల ప్రచారాలు జరిగాయి. వైసిపి కూడా చిరంజీవిని రాజ్యసభకు ప్రమోట్ చేయాలని ప్రయత్నించినట్లు ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇప్పుడు మరోసారి పవన్ చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా.. సినిమాల్లో బిజీగా ఉన్నారు చిరంజీవి. అందుకే ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందనేది తెలియాలి.

# పిపిపి విధానంలో కుంకుమసాగు

విశాఖపట్టణం : పిపిపి మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ పువ్వును పండించడానికి కంపెనీలకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు పిలుపునిచ్చారు. "స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ సాగును చేపట్టడానికి సిద్ధంగా ఉన్న కంపెనీలకు అనుమతి ఉంటుంది" అని చంద్రబాబు ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా కశ్మీర్‌గా పిలుచుకునే లంబసింగి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి మండలంలోని ఒక చిన్న గ్రామం. లంబసింగి ఇప్పటికే కాఫీ, మిరియాలు మరియు స్ట్రాబెర్రీ పంటలను పండిస్తోంది. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సాగును అభివృద్ధి చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలతో పాటు అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఎగుమతుల్లో లోపం ఉందని ముఖ్యమంత్రి గమనించారు. దానిపై ప్రధానంగా దృష్టి పెట్టి ఎగుమతులను పెంచాలని అధికారులకు సూచించారు. ఆక్వాకల్చర్ గురించి ఆలోచిస్తూ, ఆక్వాకల్చర్ కార్యకలాపాల నమోదు తప్పనిసరి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద సహజ వ్యవసాయ కేంద్రంగా మార్చడానికి చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మించడానికి కూడా చంద్రబాబు ఓకే చెప్పారు. డిజి రైతుబజార్ యాప్, వ్యవసాయ యంత్ర



పరికరాలు అందించేందుకు ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు 18 లక్షల మందికిపైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని దాన్ని నాలుగేళ్లలో 50 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రకృతి ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేస్‌బిలిటీ సౌకర్యాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు చంద్రబాబు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం వేళ రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా, అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

# అరవ బలిపశువు అయ్యారా

**కడప :** రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవశ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటున్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్ ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది. తిరుపతి జిల్లా ఎస్పీకి ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు



ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కూడా ఈ కేసులో దర్యాప్తును వేగంగా కొనసాగించి వాస్తవాలు బయటకు తీసుకు వచ్చే అవకాశాలున్నాయి. అయితే సాధారణంగా ఎస్సీ నియోజకవర్గం అంటే అగ్ర కులాల పెత్తనం ఉంటుంది. దాదాపు అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఎస్సీ ఎమ్మెల్యేలపై అగ్రవర్ణాల నేతల పెత్తనం ఎక్కువగా కనపడేది. కొందరు ధైర్యంగా ఎదురుతిరుగుతారు. చాలా మంది ఎమ్మెల్యే పదవి చాలు అని మౌనంగా ఉంటారు. అరవ శ్రీధర్ కు రైల్వే కోడూరులో అసలు పనే లేదట. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అసలు పెత్తనం చేసేది మాత్రం టీడీపీకి చెందిన నేతగా చెబుతున్నారు. అతని కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతుంది. ఇద్దరు కలసి ఉండాలని భావించినా ఆ మహిళ అరవ శ్రీధర్ కు తోడుగా ఉంటే తమ పనులు చెల్లుబాటు కావని భావించి ఇద్దరినీ దూరం చేశారంటున్నారు. తొలి నుంచి అరవ శ్రీధర్ ఆ కుటుంబానికి సేవకుడిగానే ఉంటున్నారన్నది టాక్. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రైల్వే కోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కరరావును బహిరంగంగానే ప్రకటిం చారు. యనమల భాస్కర్ రావు స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తి కావడంతో అతను ఎమ్మెల్యే అయితే తమ పనులు సాగవని భావించి టీడీపీ నేత ఒకరు చక్రం తిప్పి చివరి నిమిషంలో వైసీపీలో ఉన్న అరవ శ్రీధర్ ను జనసేనలోకి చేర్పించి టిక్కెట్ ఇప్పించారంటున్నారు. అరవ శ్రీధర్ ఏ ప్రారంభోత్సవం, శంకుస్థాపన, ప్రభుత్వ కార్యక్రమాల్లోనైనా నాలుగో స్థానంలోనే ఉంటారని చెబుతున్నారు. ఆ టీడీపీ నేత కుటుంబంలోని ముగ్గురు ముందు వరసలో ఉంటారు. పనిపాటా లేక ఈ యువతికి దగ్గరయ్యారన్నది అందుతున్న సమాచారం మేరకు తెలుస్తోంది. ఆ యువతి చదువుకున్నది కావడంతో తమకు ఇబ్బందిగా మారుతుందని భావించి టీడీపీ నేత ఇద్దరినీ దూరం చేయడంతోనే ఈ వివాదం రచ్చకెక్కిందంటున్నారు.

## నదుల అనుసంధానం జరగాలి.. ప్రతీ ఎకరాకు నీరందాలి

-మొదటిపేజీ తరువాయి

కళకళలాడుతున్నాయి. నీటి వనరుల వివరాలను డిజిటలైజ్ చేసి నీటి నిల్వలు, వినియోగం వివరాలు తెలిసేలా చర్యలు తీసుకుంటాం. పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసి..డయాఫ్రామ్ వాల్ ను నీట ముంచేశారు. రూ.440 కోట్ల విలువైన డయాఫ్రం దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ దాని పునర్నిర్మాణం కోసం రూ.1000 కోట్లు ఖర్చు అవుతోంది. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ప్రాజెక్టును పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తాం. పోలవరం ఎడమ కాలువతో వంశధారను అనుసంధానం చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. అటు నల్లమల సాగర్ తోనూ అనుసంధానించి రాయల సీమకూ నీరు తరలిస్తాం. గోదావరి, కష్ణా నదుల ద్వారా 5 వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయి. కేవలం 200 టీఎంసీల వరద నీటిని నల్లమలసాగర్ కు తరలించి కరవును తరిమికొట్టాలన్నదే మా ప్రయత్నం. తెలంగాణ రాష్ట్రం గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. విభజన జరిగిన తర్వాత ప్రాజెక్టు పూర్తి చేసినా మనం అభ్యంతరం చెప్పలేదు. మన తెలుగు సోదరులే అక్కడా ఉన్నారు. మనవాళ్లే నీళ్లు వినియోగించుకుంటే అందరికీ సంతోషమే. వారు నీళ్లు వినియోగించుకున్నా ఏపీకి అభ్యంతరమే లేదు. నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులే ఇంజనీర్లుగా మారి నీటి నిర్వహణను చేపట్టండి. వినూత్న ప్రయోగాలు చేయండి అని సీఎం చంద్రబాబు సూచించారు.

## కల్తీ నెయ్యి దోషుల్ని వదిలిపెట్టం

-మొదటిపేజీ తరువాయి

పుట్టినవారు తిరుమల పవిత్రతను దిగజార్చేందుకు ఏ స్థాయికైనా దిగజారుతారు. వారు భగవంతుడి మీదే పగ పట్టారన్నారు. భగవంతుడి మీద పగ పట్టిన వారు మట్టికొట్టుకుపోతారని తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యి అసలు పాల నుంచి చేసిందే కాదని రిపోర్టులో పేర్కొన్నట్టు చెప్పారు. చేసిన తప్పుకి క్షమాపణ కోరకుండా ఎదురు మమ్మల్ని క్షమాపణ చెప్పమని బుకాయిస్తున్నారన్నారు. ఇది హిందూ విశ్వాసాల మీద జరిగిన దాడి. తప్పు చేసిన వారు ఏడుకొండల వాడికి క్షమాపణ చెప్పి తీరాల్సిందే. కల్తీ నెయ్యి కేసులో దోషుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం వదలదని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు జరిగితే పిచ్చోడి పనన్నారు. 2019 నుంచి 2024 వరకు జరిగిన వైసీపీ పాలనలో ఎన్నో దేవాలయాలపై దాడులు జరిగాయి. అన్నీ మతపరంగా సున్నితమైన అంశాలే. రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఎవరో ఆకతాయి చేశాడు. పిచ్చోడు చేశాడని చెప్పారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే అదీ పిచ్చోడి పనే అన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు చోరీకీ గురై పోతే కొత్తది కొనుక్కోవచ్చంటూ తేలికగా మాట్లాడారు. అంతర్వేదిలో రథం తగులబెడితే అదీ ఎవరో పిచ్చోడి పనే అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు 219కి పైగా జరిగాయి. ఒక్క అంశంలోనూ సరైన చర్యలు తీసుకున్నది లేదు. ఇలాంటి అంశాల్లో ఏ రోజూ రాజకీయ ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. ఎ జంతు కొవ్వు ఉందని ఎన్.డి.డి.బి. రిపోర్టు చెప్పింది. కల్తీ జరిగిందని 2022లోనే తెలిసినా వైసీపీ హయాంలో రిపోర్టు తొక్కిపెట్టారు. మీడియా సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయండి

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. సెర్ప్‌ఎఫ్.పి.ఓల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక 'టూల్' అభివద్ధిపై చర్చించారు. 'ఒక ఎఫ్.పి.ఓ ఒక ఉత్పత్తి' విధానంలో భాగంగా వాల్యూ చైన్ అభివద్ధి, ఎఫ్.పి.ఓల స్థాయిలో చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. ప్రతీ నెల, సంవత్సర కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్, జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. విజయవంతమైన ఎఫ్.పి.ఓల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలని సూచించారు. ఎన్.జి.ఓల పురోగతిని సమీక్షించడానికి ఒకే రకమైన ఫార్మాట్‌ను రూపొందించాలని, అలాగే ఎన్.జి.ఓ భాగస్వాములు సంబంధిత జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లతో (పిడిలతో) సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో సెర్ప్ కార్యదర్శి వాకాటి కరుణ, డిప్యూటీ సి.ఇ.ఓ శ్రీరాములు నాయుడు, హైపర్ ఇంటర్నేషనల్, బ్రెడ్స్, కాల్గుడి, డిజిటల్ గ్రీన్, వాసన్, విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

## 'ఏఐ4 ఏపీ పోలీస్'తో నూతన ప్రాజెక్ట్

-మొదటిపేజీ తరువాయి

డేటా సేకరణ, నిందితులకు శిక్ష పడేందుకు నేరపరిశోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏఐ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. డిజిటల్ పోలీసింగ్ అమలు చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించవచ్చని డీజీపీ తెలిపారు. పోలీసు రంగంలో ఏఐని వినియోగించి ఎలాంటి లోపాల్లేకుండా విధులు కొనసాగించవచ్చన్నారు. పోలీసింగ్‌లో కృత్రిమ మేధ వినియోగాన్ని మరింత విస్తృతం చేసేందుకు వీలుగా 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరిట రాష్ట్రంలోని చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టుల అమలును డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ప్రారంభించారు. పిటిషన్ ఏఐ, డిజిటల్ ఎవిడెన్స్ ఏఐ, కాగ్నిటివ్‌నెట్ ఏఐ, ఇన్వెస్టిగేషన్ కో-పైలట్, డాక్స్ 2 డేటా, సోషల్ ఇంటెలిజెన్స్ ఏఐ, న్యూస్ 360 ఏఐ, ఏఐ ఫౌండేషన్ పేరిట మొత్తం 8 రకాల ఏఐ టూల్స్‌ను ఈ మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వినియోగించనున్నారు. ఇవి ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారం, డిజిటల్ సాక్ష్యాల విశ్లేషణ, ఆధార సహిత దర్యాప్తు, దర్యాప్తు అధికారికి సాంకేతిక సహకారం, సామాజిక మాధ్యమాలపై నిఘా తదితర అంశాలకూ ఉపయోగపడనున్నాయి.

**ఆరు నెలల్లో అన్ని జిల్లాల్లో అమలు**

గతేడాది జూన్‌లో 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరిట హ్యాకథాన్ నిర్వహించి అందులో భాగంగా రాష్ట్రంలో అమలు చేసేందుకు అనువుగా ఉన్న పలు ఏఐ టూల్స్‌ను గుర్తించారు. వాటిని మరింత అభివృద్ధి పరిచి ఇప్పుడు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అమల్లో ఏపీ పోలీసులు ఎప్పుడూ ముందున్నారని, ఆరు నెలల్లో అన్ని జిల్లాల్లో దీన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సేవల విభాగం ఐజీ సీహెచ్.శ్రీకాంత్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ఎనిమిది మాడ్యూల్స్‌తో :**

'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్ట్‌లో ఎనిమిది మాడ్యూల్స్ కీలకం కానున్నాయి.

ప్రజల నుంచి వచ్చిన పిటిషన్లపై అధికారులు సమీక్ష చేసినప్పుడు పిటిషన్ ఏఐని వినియోగిస్తారు. దీనివల్ల సమీక్ష సమయం 30-45 నిమిషాల నుంచి 5-10కి తగ్గుతుంది.

టెలికాం ఆపరేటర్లు, బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలకు నోటీసుల జారీ, వాటి ట్రాకింగ్‌ను ఆటోమేషన్ చేసేందుకు డిజిటల్ ఎవిడెన్స్ ఏఐని వినియోగిస్తారు.

కాగ్నిటివ్‌నెట్ ఏఐ అనేది కాల్ డేటాలను, బ్యాంకు స్టేట్‌మెంట్లను ఎనలైజ్ చేసి, ఆ వివరాలను దర్యాప్తు అధికారులకు తెలియజేస్తుంది.

ఇన్వెస్టిగేషన్ కో-పైలట్ అనే మాడ్యూల్ బీఎన్ఎస్, పోక్సో, ఐటీ యాక్ట్‌లకు సంబంధించి సెక్షన్లను సూచిస్తుంది. కేస్ డైరీలను వాలిడేట్ చేస్తుంది.

పేపర్ ఆధారిత పర్సనల్ రికార్డులను ఏఐ పవర్డ్ ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నైజ్ చేసి డిజిటల్ నాలెడ్జ్ బేస్‌గా మార్చేందుకు డాక్స్ 2 డేటా అనే మాడ్యూల్ సహకరిస్తుంది.

నాయిసీ వాట్సప్ గ్రూప్ చాటర్‌లపై చర్య తీసుకోదగిన ఇంటెలిజెన్స్‌గా మార్చేందుకు సోషల్ ఇంటెలిజెన్స్ ఏఐ మాడ్యూల్ ఉపకరిస్తుంది.

రాష్ట్ర స్థాయి, జిల్లాల్లో అన్ని పత్రికల్లో వచ్చే వార్తలను ట్రాక్ చేసేందుకు న్యూస్360 ఏఐ మాడ్యూల్‌ని వినియోగిస్తారు. ఇది వార్తలను అనువదించి, సమ్మరైజ్ చేస్తుంది.

ఏఐ ఫౌండేషన్ అనే మాడ్యుల్ డేటా సెక్యూరిటీని, కన్సిస్టెంట్ అవుట్‌పుట్స్‌ను నిర్ధారిస్తుంది.

# సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం

- : ఈ ఏడాది 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 05 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అక్షరాంధ్ర" కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం నగరంలోని మున్నా నగర్ లో ఉన్న వయోజన విద్యా కేంద్రమును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలో మొత్తం 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిఆర్డీఏ, డ్వామా, మెప్మా శాఖల ద్వారా వాలంటరీ టీచర్లను, అభ్యసకులను గుర్తించి, వారికి భోదనాభ్యసన ప్రక్రియను అందిస్తున్నట్లు వివరించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెప్మా (వీజూహీూ) పరిధిలోని స్వయం సహాయక బృందాల సభ్యుల్లో 37,500 మందిని, డీఆర్‌డీఏ (DRDA) ద్వారా 62,500 మందిని, ఉపాధి హామీ పథకం (NREGS) పరిధిలో 25,000 మంది వేజ్ సీకర్స్ ను అక్షరాంధ్ర కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు మొత్తం 100 గంటలపాటు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం (కూడికలు, తీసివేతలు)పై భోదన అభ్యసన ప్రక్రియ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రభుత్వం గుర్తించిన వాలంటరీ టీచర్ల ద్వారా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం అవసరమైన పాఠ్య పుస్తకాలు, వర్క్ షీట్లు అందజేయడంతో పాటు, వీడియో పాఠ్యాంశాల ద్వారా కూడా బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. భోదనాభ్యసన ప్రక్రియ అనంతరం లబ్ధిదారుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఫిబ్రవరి చివరి వారంలో ప్రీ-ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు, అలాగే మార్చి 29వ తేదీన NIOS, న్యూ ఢిల్లీ వారిచే FLNAT ఫైనల్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ వయసులో చదువు అవసరమా అనే సందేహాలు పక్కనపెట్టి, అక్షరాస్యత వల్ల భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. తల్లిదండ్రుల చదువు ద్వారా తమ పిల్లల యొక్క చదువు కూడా మెరుగు పడుతుందని, వ్యక్తిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునే అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా అక్షరాస్యత రేటును గణనీయంగా పెంచేందుకు అధికారులు, వాలంటరీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అనంతపురము జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు సంపంగి వెంకటేశ్వర్లు, వయోజన విద్య సిబ్బంది సూర్యనారాయణ, శ్రీధర్, రమణ, లక్ష్మినారాయణ, లక్ష్మి ప్రసన్న మరియు ఆర్.పి.లు రాణి, సునంద, మాధవి, వాలంటరీ టీచర్ రాజ్యలక్ష్మి మరియు అభ్యాసకులు పాల్గొన్నారు.

# ఎమ్.ఎస్.ఎమ్.ఈ లపై అనుసరణ భారం తగ్గింపే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

- ఏపీలో ఇన్నోవేటివ్ స్కీమ్ కింద 74 హోస్ట్ ఇన్స్టిట్యూట్లకు ఆమోదం, 36 సంస్థలకు నేరుగా మద్దతు
- కేంద్ర ఎమ్.ఎస్.ఎమ్.ఈ, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే వెల్లడి
- ఎమ్.ఎస్.ఎమ్.ఈ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**అంకుశం ప్రతినిధి విజయవాడ ఫిబ్రవరి 5 :** ఎమ్.ఎస్.ఎమ్.ఈ చాంపియన్స్ పథకం కింద అమలు చేస్తున్న ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇన్నోవేటివ్ స్కీమ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 74 హోస్ట్ ఇన్స్టిట్యూట్లు ఆమోదం పొందగా, 36 సంస్థలకు నేరుగా మద్దతు లభించి, మొత్తం 129 ఇన్నోవేటివ్ ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర ఎమ్.ఎస్.ఎమ్.ఈ, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. దేశవ్యాప్తంగా 773 హోస్ట్ ఇన్స్టిట్యూట్లు ఆమోదించబడ్డాయని, వీటిలో 410 సంస్థలకు నేరుగా మద్దతు అందుతోందని, ఇప్పటివరకు 1,418 ఇన్నోవేటివ్ ఆలోచనలకు ఆమోదం లభించిందన్నారు.



లోక్ సభలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్.ఎస్.ఎమ్.ఈ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలపై కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా,కేంద్ర ఎమ్.ఎస్.ఎమ్.ఈ, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

ఎమ్.ఎస్.ఎమ్.ఈ లపై అనుసరణ భారం తగ్గింపే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.డిజిటలైజేషన్, నియంత్రణ సరళీకరణ, ఇన్నోవేషన్ ద్వారా సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేసే దిశగా పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎమ్.ఎస్.ఎమ్.ఈ లపై నియంత్రణ నిబంధనలు, పన్నులు, నాణ్యత ప్రమాణాలు, నివేదికల బాధ్యతల వల్ల ఏర్పడుతున్న అనుసరణ భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ తో పాటు నియంత్రణ సరళీకరణ చర్యలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్.ఎస్.ఎమ్.ఈ ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడానికి 01 జూలై 2020న ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభించామని, ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో, కాగితరహితంగా, స్వీయ ప్రకటన ఆధారంగా జరుగుతోందని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే వివరించారు. అలాగే అసంఘటిత సూక్ష్మ పరిశ్రమలను అధికారిక వ్యవస్థలోకి తీసుకురావడానికి 11 జనవరి 2023న ఉద్యోగం అసిస్ట్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించామని, దీని ద్వారా ఈ సంస్థలు ప్రాధాన్య రంగ రుణాల లాభాలు పొందుతున్నాయని తెలిపారు. 2012 నాటి ప్రజా కొనుగోలు విధానంలో అనుసరణల సంఖ్యను 7 నుండి 4కి తగ్గించామని, ప్రభుత్వ ఈ-మార్కెట్ ప్లేస్ (GeM) పోర్టల్ ద్వారా ఎమ్.ఎస్.ఎమ్.ఈ లకు ప్రభుత్వ కొనుగోళ్లు మరింత సులభతరంగా జరిగాయని మంత్రి పేర్కొన్నారు.

## ఆలయ నిర్మాణమునకు విరాళము అందించిన టిడిపి నేత సంధా రాఘవ.



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 5:** పట్టణంలోని రాజేంద్రనగర్ లో నిర్మిస్తున్న శ్రీ శ్వేతార్క వరాల వరసిద్ధి వినాయక దేవస్థానమునకు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సంధా రాఘవ 50 వేల రూపాయల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణము కొరకు తనవంతుగా ఈ విరాళమును అందజేసినట్లు సంధా రాఘవ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ వారు సంధా రాఘవ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 7న శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ఫిబ్రవరి 8న ధ్వజారోహణం

**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 5::** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఫిబ్రవరి 7న సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8 నుండి మార్చి 17వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.అంకురార్పణం సందర్భంగా సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు మూషిక వాహనంపై శ్రీ వినాయకస్వామివారు పురవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ తరువాత సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం నిర్వహిస్తారు.

**ఫిబ్రవరి 8న ధ్వజారోహణం :**

ఫిబ్రవరి 8న ఉదయం 6.05 గంటలకు మకర లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహన సేవ జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పురవీధుల్లో వాహన సేవలు నిర్వహిస్తారు.

## 2 కోట్ల తో ఆర్టీసీ ఆర్ఎం నూతన కార్యాలయానికి భూమి పూజా కార్యక్రమం


- కడప రీజనల్ పరిధిలో 20కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు
- అనంతపురం ఆర్టిసి బస్టాండ్ రూపురేఖలు మారుస్తాం..
- ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 5:** అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారుస్తున్నామని ఆర్టీసీ జోనల్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు తెలిపారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ లో నూతన ఆర్ఎం కార్యాలయానికి భూమి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి , ఆర్టీసీ ఆర్ఎం శ్రీ లక్ష్మి, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. అనంతపురం ఆర్టిసి బస్టాండ్ నందు 2కోట్ల రూపాయలతో నూతన ఆర్ఎం కార్యాలయానికి భూమి పూజ చేశారు. సూపర్ సిక్స్ లో భాగంగా శ్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాలు కల్పించామన్నారు. ఆర్టీసీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కేవలం కడప రీజనల్ పరిధిలో 20 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, ప్రయాణికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఉద్యోగుల మెడికల్ అండ్ ఫిట్ ప్రమోషన్ల వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.


## శాసన మండలి చైర్మన్ కుమారుడి వివాహం లో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 04:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు కుమారుడు వివాహ వేడుకల్లో రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈ వివాహ వేడుక ల్లో పాల్గొన్నారు. మండపేట నియోజకవర్గం వైసీపీ ఐటి విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, తణుకు అశోక్ లు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం!

- ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కైప ద్వారకనాథ్ శర్మ...



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 5:** మాఘ మాసం ఇష్ట దైవం పరమ శివుడు సత్య సాయి జిల్లా ధర్మవరం ప్రాచీన ఆలయం లో శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగిందని ఆలయ నిర్వాహకులు ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కైప ద్వారకనాథ్ శర్మ గురువారం తెలిపారు. ఈ కల్యాణ ఉత్సవశీ కోసం సహకారం అందించిన దాతలకు, శివ దీక్షమాలధారణ కమిటీ వారికి ,వేడుకలకు విచ్చేసిన భక్తులకు, ఆయన తన కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

- ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జిల్లా ఎస్పీ జగదీష్ఆదేశాలతో అంత్యక్రియలకు రూ . 2 లక్షల ఆర్థిక సాయం అందజేత



**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 5:** అనంతపురం ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాజు మృతదేహానికి ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను 1996 సంవత్సరంలో కానిస్టేబుల్ గా చేరారు. ప్రస్తుతం జిల్లా ఏ.ఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నాడు. ఇతను నిన్న రైలు కిందపడి చనిపోయాడు. స్థానిక నవోదయ కాలనీకి చెందిన సుబ్బరాజు మృతదేహానికి ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో స్థానిక నవోదయ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు ముగించారు. మృతుడికి భార్య రాధమ్మ, కొడుకుమాధవ్ , కూతురు మేఘనలు ఉన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణలు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈరోజు స్థానిక నవోదయ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ మరియు బ్యాచిమేట్స్ సూరి, ప్రకాష్ , బిటిస్వామి, రామకృష్ణ మరియు మృతుని బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిపై సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్
- యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పన్నుల వసూలు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి




**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 5:** యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో ప్రజల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు అడిషనల్ కమిషనర్ లహరి పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పన్నుల వసూలుపై



రెగ్యులర్ సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న శానిటేషన్ పనుల్లో నాణ్యత ఉండాలని, గ్రామాల అభివృద్ధి బాధ్యత పంచాయతీ రాజ్ శాఖపై ఉందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు.రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.సమావేశం అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పంచాయతీ రాజ్ సిబ్బందికి అడిషనల్ కమిషనర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఇూూ సమత, కదిరి,పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం డి డి ఓ లు,పెనుకొండ, ధర్మవరం డిఎల్పిఓ లు జిల్లాలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఐఎ పూణూం, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ ని కలిసిన చేనేత, మరియూ చేనేత జౌళీ శాఖ మంత్రి శ్రీమతి ఎస్. సవిత



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 5:** అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత పి ఏ. తెలియజేసారు.. శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధిపై చర్చించిన ఇరువురు మంత్రులు. రాబోయే బడ్జెట్ లో జిల్లాకు అధిక నిధులు రాబట్టే అంశంపైనా చర్చించిన మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్

## ధర్మవరంలో పోలీస్ ట్రాఫిక్ చర్యలు కట్టు దిట్టం....




**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 5:** జిల్లా ఎస్.పి. మరియూ ధర్మవరం డి. ఎస్.పి. హేమంత్ కుమార్ ఆదేశాలు మేరకు ఒన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్,ఆధ్వర్యంలో మరియూ ట్రాఫిక్ ఎస్.ఐ. బి. సూర్య నారాయణ,తమ సిబ్బంది తో కలసి పట్టణం లో ట్రాఫిక్ చర్యలు కట్టుదిట్టం చేశారు.ప్రజలు ముఖ్యం గా ధర్మవరం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖతో సహకరించాలని వారు కోరారు.పట్టణ పరిసరాలలో ఏ వాహనం స్పీడ్ గా నడుపరాదన్నారు. రోడ్డు భద్రతా సూత్రాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

# ఏప్రిల్-మే నెలల్లో జిల్లాకు కొత్త ఆర్టీసీ బస్సులు

- అనంతపురం నగరానికి 10 ఎలక్ట్రిక్ సిటీ సర్వీస్ బస్సులు
- ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రకటన
- రూ.2కోట్లతో ఆర్‌ఎం ఆఫీస్ కు భూమి పూజ చేసిన నాగరాజు, దగ్గుపాటి





**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 05 :** ఏప్రిల్, మే నెలలో అనంతపురం జిల్లాకు నూతన ఆర్టీసీ బస్సులు రాబోతున్నాయని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గురువారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో రీజినల్ మేనేజర్ కార్యాలయానికి వారు భూమి పూజ చేశారు. రెండు కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ పనులను ఛైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీలక్ష్మి, డిఎం, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఆర్‌ఎం కార్యాలయం పెండింగ్ లో వాటి నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఛైర్మన్ పూల నాగరాజు రెండు కోట్లు నిధులు తీసుకొచ్చారన్నారు. నాగరాజు ఛైర్మన్ అయ్యాక 20 కోట్లతో రీజనల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ బస్టాండ్లలో పరిస్థితులు పూర్తిగా మారాయన్నారు. ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం నగరంలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా 10 సిటీ సర్వీసులు తీసుకురాబోతున్నామని.. ఇందుకు పది ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించినట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారన్నారు. ఇప్పుడు శ్రీకాకుళం నుంచి హిందూపురం వరకు మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారన్నారు. అంతే కాకుండా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా 20 నెలల్లోని 130 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. 30ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఉద్యోగుల గురించి గానీ ప్రయాణికుల సౌకర్యాలు గురించి పట్టించుకోలేదన్నారు. తమ రీజనల్ పరిధిలో తాను ఛైర్మన్ గా వచ్చినప్పటి నుంచే 20 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. గుత్తి బస్టాండ్ నిర్మాణాన్ని 6 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించామన్నారు. రాయదుర్గంలో 60 లక్షల రూపాయలతో బస్టాండ్ ఆధునీకరణ చేస్తున్నామని, మడకశిర డిఎం కార్యాలయాన్ని 30 లక్షల రూపాయలతో, హిందూపురం బస్టాండ్ లో 10 లక్షల రూపాయలతో ప్రయాణీకుల సౌకర్యం కోసం పలు నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. కదిరి, ధర్మవరం, పెనుకొండలో కూడా ఆధునీకికరణ పనులు జరుగుతున్నాయని వివరించారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఆర్‌ఎం కార్యాలయానికి రెండు కోట్ల రూపాయలతో భూమి పూజ చేసినట్లు ఆయన వివరించారు. ప్రయాణికులు ఎక్కడా ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని అదే సమయంలో ఉద్యోగుల సమస్యలు కూడా దీర్ఘకాలికంగా ఉన్న వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంప్లాయిస్ మెడికల్ అన్ ఫిట్ విషయంలో మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని 2000 కుటుంబాలకు న్యాయం చేశారన్నారు. ప్రమోషన్ల విషయంలో కూడా వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏప్రిల్, మే నెలలో కొత్త ఆర్టీసీ బస్సులు రాబోతున్నట్లు ఆయన వివరించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటికే లక్షలాది మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని తెలిపారు..

# హంద్రీనీవా కోసమూ పోరాడదాం







- చలో పోతిరెడ్డిపాడు బహిరంగ సభలో వైఎస్ఆర్సీపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు

**అంకుశం ప్రతినిధి కర్నూల్, ఫిబ్రవరి 5 :** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలన్న డిమాండ్‌తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపాడు గ్రామంలో బహిరంగ సభ.. నిర్వహించింది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు హంద్రీనీవా పైనా పోరాటం చేయాలని పిలుపునిచ్చిన వైఎస్ఆర్సీపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి

అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఇష్టా రాజ్యంగా ప్రాజెక్టులు కట్టి శ్రీశైలం ప్రాజెక్టులో 780 నుంచి 800 అడుగుల నీటిమట్టం నుంచే నీటిని తోడేస్తున్నారు వైయస్ జగన్ సీఎం అయిన తర్వాత రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించి 800 అడుగుల నుంచే నీటిని తరలించేలా చర్యలు తీసుకున్నారు.పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80000 క్యూసెక్కులకు పెంచిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డిది. 2024 మే నెల వరకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగాయి 2024 జూన్ 12వ తేదీన చంద్రబాబు సీఎం అయ్యాక రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపివేశారు. ఎన్జిటి (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) అభ్యంతరాలతోనే పనులు ఆపేసారని అంతా అనుకున్నారు. కానీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో లోపాయికారి ఒప్పందంతోనే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రహస్యంగా నిలిపివేశారు. తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.లిఅని వెంకట్రాంరెడ్డి గుర్తు చేశారు. మనకోసం, మన భవిష్యత్తు కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం తాగు, సాగునీరు అవసరాలకు రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆవశ్యకత ఎంతైనా ఉంది. అని వెంకట్రామరెడ్డి అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును ఎన్టీ రామారావు 40 టీఎంసీలతో చేపడితే చంద్రబాబు సీఎం అయ్యాక 5 టీఎంసీలకు కుదించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యాక 2005లో రాయలసీమలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా హంద్రీనీవా ను 40 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టారు. వైయస్ రాజశేఖరరెడ్డి కృషితోనే 2012 నుంచి కృష్ణా జలాలు రాయలసీమకు వస్తున్నాయి. కానీ ఈరోజుకి అనుకున్న మేరకు ఆయకట్టుకు మీరు అందించలేని పరిస్థితి ఉంది. అని అనంత వెంకట్రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు వైయస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక హంద్రీనీవా సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కుల నుంచి 6300 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. టెండర్లు కూడా పూర్తయ్యాయి.లిఅని వెంకట్రామిరెడ్డి అన్నారు. 2024 లో చంద్రబాబు మరోసారి సీఎం అయ్యాక 6300 క్యూసెక్కులను తగ్గించి మరోసారి 3850 క్యూసెక్కులకే పరిమితం చేశారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు హంద్రీనీవా విస్తరణ పై కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయాలి. సజ్జల రామకృష్ణారెడ్డి , పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ విషయం పై నిర్ణయం తీసుకోండి. అని అనంత వెంకట్రాంరెడ్డి అన్నారు

# పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించండి..

## రైతు సంఘం జిల్లా నాయకులు.



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 5:** పాత ఉపాధి హామీ చట్టాన్ని మాత్రమే కొనసాగించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్డీవో ఏ. మహేష్ కు, వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుచేసి ఆ స్థానంలో జి రాంజీ పేరుతో తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దుచేసి పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. 2005 ఉపాధి హామీ చట్టం అమలు జరిగిన చోట గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక న్యాయం ఆర్థిక స్వాతంత్రం భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు కల్పించింది అన్నారు. కేంద్రం 60 శాతమురాష్ట్రాలకు వారంపడేలా 40 శాతము నిధులు ఖర్చు పెట్టాలని తెలిపారు. చట్టము 73,74 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా పని హక్కును కాలరాస్తు, జి రాంజీ చట్టం చేయడం కోట్లాదిమంది పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, చేనేత నాయకులు హెచ్ హెచ్ భాష ,సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి శేషంపల్లి మారుతి జేవీ రమణ,ఎల్ ఆదినారాయణ, గుంపు హరి, ఆంజనేయులు ,నరసింహారెడ్డి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు

## మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా, ర్యాలీ

- నున్నలో రెడ్ క్రాస్, షోఫి హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ



**అంకుశం ప్రతినిధివిజయవాడ ఫిబ్రవరి 5:** విజయవాడ రూరల్ మండలం నున్నలోని షోఫి హైస్కూల్‌తో కలిసి విజయవాడలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రతపై గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీ ప్రజలకు, ముఖ్యంగా యువతకు, మాదకద్రవ్యాల దుర్వినియోగ ప్రమాదాలు, ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్లు ధరించడం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. షోఫి హైస్కూల్ కరస్పాండెంట్ వై వెంకటేశ్వరరావు నాయకత్వంలో, షోఫి హైస్కూల్ విద్యార్థులు నున్న గ్రామం అంతటా ర్యాలీని నిర్వహించారు, ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, హెల్మెట్లు ధరించి ట్రాఫిక్ నియమాలను పాటించాలని పిలుపునిస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీ నివాసితులు, ప్రయాణికుల దృష్టిని ఆకర్షించింది, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలి యొక్క సందేశాన్ని వ్యాప్తి చేసింది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఇ చిట్టి బాబు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థులలో అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. హెల్మెట్లు ధరించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చని ఆయన నొక్కిచెప్పారు. యువతలో రోడ్డు భద్రత మరియు ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించే కార్యక్రమాలకు తల్లిదండ్రులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. షోఫి హై స్కూల్ అకడమిక్ ఇన్‌చార్జ్ డి ప్రసన్న మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే ప్రచారంలో చురుకుగా పాల్గొని సామాజిక బాధ్యత తీసుకున్నందుకు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సామాజిక అవగాహనకు రాయబారులుగా మారాలని ఆమె ప్రోత్సహించారు. రెడ్ క్రాస్ కోఆర్డినేటర్లు కనక రాజు, సునీత, షోఫి హై స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జ్ ఎం సోమలత, ప్రధానోపాధ్యాయుడు డి రవి కుమార్ ,ప్రాథమిక ఇన్‌చార్జ్ పి వసంతి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అది రాయలసీమ ఎత్తిపోతల కాదు, నెల్లూరు ఎత్తిపోతల పథకం.

- రాయలసీమ పేరుతో వైసీపీ ప్రజా ధనం దోసుకునేందుకే నెల్లూరు ఎత్తిపోతల.
- వైసీపీ లూట్ మార్ రాజకీయం చేస్తోంది.
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి.



కుంగిన అలగనూరు రిజర్వాయర్ పై నుంచి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి

**అంకుశం న్యూస్ నంద్యాల ఫిబ్రవరి 5:** రాయలసీమ పేరుతో నెల్లూరు కు నీళ్లు తరలించి వైసీపీ ప్రజా ధనం దోసుకుందని, రాయలసీమను వైసీపీ నాయవంచన చేసిందని, రాయలసీమకు ద్రోహం చేసి ఛిగ్గులేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అబండాలు వేస్తూ వైసీపీ బ్లేమ్ గేమ్ ఆడుతుందని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజకవర్గం, మిడ్తూరు మండలం అలగనూరు రిజర్వాయర్ కట్ట తెగిన చోట విలేకరుల సమావేశం నిర్వహించారు.జగన్ నిర్వాకం వల్ల కేవలం కోటిన్నర రూపాయల నిధులు అలగనూరు రిజర్వాయర్ కు ఇవ్వనందుకు ప్రస్తుతం రూ. 60 కోట్ల కు మరమ్మాతులకు ఖర్చు చేయాల్చి వస్తుందని బైరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలన నిర్లక్ష్యం కు సాక్ష్యం గా ఉన్న తెగి రిపేరుకు ఎదురు చూస్తున్న అలగనూరు రిజర్వాయర్ లో వైసీపీ సభ పెట్టింటే బాగుండేదని బైరెడ్డి అన్నారు. సీమ ఎత్తిపోతల పథకం వద్ద వైసిపి నేతల మీటింగ్ పెట్టడం పై బైరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసిపిలో ఒక్క నాయకుడికి వ్యవసాయం పై అవగాహన లేదనీ, ఉన్న వాళ్ళందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులేనని, అలగనూరు తెగిపోయి గత ఐదేళ్ళలో వైసిపి పట్టించుకోలేదనీ, క్యూసెక్కులు అంటే తెలియని వాళ్లు వైసిపిలో ఉన్నారనీ, సీమ ప్రజలను నయవంచన చేయడానికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాంతంలో మీటింగ్ పెట్టారని బైరెడ్డి మండిపడ్డారు. ఎవరిని మభ్యపెట్టాలని ఈ సభ పెటారని ఆయన నిలధీశారు. రాయలసీమ ఎత్తిపోతల అనుమతులు లేకుండా జగన్ మొదలు పెట్టి ఆయన పాలనలోనే గ్రీన్ ట్రిబ్యునల్ నిలిపివేస్తే ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆపారని నిందలు వేయడం వైసీపీ నాయకులకే చెందిందన్నారు. రాయలసీమలో ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదని, వైసీపీ లో క్యూసెక్కు, టీ ఎం సి లకు తేడా తెలియని వారు ఉన్నారని బైరెడ్డి ఏద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు రోళ్లపాడు గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, జలకనూరు స్వామిరెడ్డి, కోట మురళి, కౌన్సిలర్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## 49 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

- ఆర్థిక ఇబ్బందులో ఉన్న పేద కుటుంబానికి కూటమి ప్రభుత్వం చేయూత





**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 5:** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని పుట్టపర్తి నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజవర్గంలోని 49 మందికి రూ.40 లక్షల 45వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఏ ఇబ్బంది వచ్చినా మీకు నేనున్నా అండగా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రజలకు ఒక నమ్మకాన్ని భరోసాను ఇస్తున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. నియోజకవర్గం లో ఇప్పటివరకు రూ.3కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేసి పేదలను ఆర్థికంగా ఆదుకున్నట్టు తెలిపారు. కష్టసుఖాల్లో ప్రజలతో పాలుపంచుకొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ను కూటమి ప్రభుత్వాన్ని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి నీ ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, బోయ రామాంజనేయులు, విజయ్ కుమార్,వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ , మల్లి రెడ్డి, శెట్టి వారి జయచంద్ర,గోపాల్ రెడ్డి, మైలే శంకర్ ,సింగిల్ విండో అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి,తుమ్మల మహబూబ్ బాషా, శివారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.